బుధవారం 9 అక్టోబర్ 2024 5 అనంతపురం

మిలాఖత్ అవుదామా...వెనక్కు తగ్గుదామా..!

◆ మద్యం షాపులపై మంతనాలు ◆ మరో మూడు రోజులు పొడిగించే అవకాశం ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మద్యం దుకాణాల టెండరు దాఖలుకు సమయం బుధవారంతో ముగియనుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లోనూ టెండరు స్వీకరణ జరుగుతోంది. రెండేళ్ల కాల వ్యవధితో ఇస్తున్న ఈ టెండరున్ దక్కించుకోవడానికి అనేక మంది వ్యాపారులు, రాజకీయ నాయకులు దృష్టి సారించారు. రాబోయే రెండేళ్ల కాలంలో జరగబోయే మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు నేతలు కూడా సిద్ధమయ్యారు. 2019 ముందు వరకు ఇదే విధానం ఉండేది. 2019 అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ మద్యం పాలసీని తీసుకొచ్చింది. దీనిపై అనేక ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో మద్యం విధానం మార్పు చేస్తామని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తూనే దీనిపై దృష్టి సారించింది. కొత్త విధానాన్ని ప్రకటించడమే కాకుండా టెండర్లు ఆహ్వానించింది. గడిచిన ఐదేళ్లుగా మద్యం వ్యాపారం లేకపోవడంతో వ్యాపారులతోపాటు, రాజకీయ నాయకులకు ఆదాయం వనరు లేకుండా పోయింది. ఇప్పుడు ఆ ఆదాయం మార్గం రావడంతో మద్యం టెండరును దక్కించుకునేందుకు ఉత్సాహం చూపారు. ప్రభుత్వం పెట్టిన రెండు లక్షల రుసుం భారంగానే ఉన్నప్పటికీ అదృష్టం పరీక్షించుకుందామని కొంత మంది ఆలోచిస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం ఇంత ఆదాయ వనరును వదులుకునేందుకు సిద్ధపడటం లేదు. ఎలాగైన తాము దక్కించుకోవాలని నేరుగానే రంగంలోకి దిగుతున్నారు. తమ అనుయాయుల ద్వారా దారఖాస్తు చేసుకోవాలనుకుంటున్న వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తమ పరిధిలో తమ అనుమతి లేకుండా ఎవరూ వేయడానికి వీల్లేదని చెబుతుండటంతో టెండర్లపై ఆశలు పెట్టుకున్న వారిలో నిరాశే ఎదురవుతోంది. రెండు లక్షలు ముందుగా చెల్లించి తరువాత రాకపోయినా... ఒకవేళ వచ్చినా ప్రజాప్రతినిధులను ఎదురించి మద్యం దుకాణం నడపడం సాధ్యమవుతుందా అన్న సందేహాలతో చాలా మంది వెనక్కు తగ్గుతున్నారు.

అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలకు టెండర్లు పిలిస్తే 1272 మాత్రమే దాఖలవగా, సత్యసాయి జిల్లాలో 87కుగాను 617 దాఖలయ్యాయి. బుధవారంతో టెండరు దాఖలు గడువు ముగియనుంది. సమయం తక్కువగా ఉండటంతో ఉన్న వారు నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా, మరికొంత మంది గ్రూపుగా అయ్యి టెండరు వేయడానికి సిద్ధమవుతున్నారు. చివరి రోజు ఏ రకంగా దరఖాస్తులు రానున్నాయన్నది చూడాల్సి ఉంది. జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో ముఖ్య నేతలు మాత్రం టెండరు దాఖలుపైగా నిశితంగా దృష్టి సారించారు. తమకు తెలియకుండా ఎవరు వేస్తున్నారన్న దానిపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. ఒకట,రెండు నియోజకవర్గాల్లో ముఖ్య నేతలే తమ సమీప బంధవులు, అనుయాయుల ద్వారా ఇప్పటికే దరఖాస్తులు చేయించారు.

మరో మూడు రోజులు పొడిగించే అవకాశం..?

మద్యం దుకాణాల టెండర్లకు స్పందన తక్కువగా ఉండటంతో ప్రభుత్వం మరో మూడు రోజులు పొడిగించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అకవాశాలున్నట్టు ప్రచారాలు సాగుతున్నాయి. ఇంకోవైపు నేతలు మాత్రం కట్టడి చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

◆ శంకరనారాయణ, ఉషశ్రీచరణ్ గ్రూపులుగా వైసీపీ

◆ ఆధిపత్యం కోసం ఎవరి పంతం వారిదే...

◆ రెండు గ్రూపులుగా వేర్వేరు సమావేశాలు

◆ ఇద్దరిపైనా సొంతపార్టీలోనే వ్యతిరేకత

పెనుకొండ కోసం.. మాజీల పట్టు..!

వేరే ప్రాంతాల నుంచి వచ్చిన ఇద్దరు మాజీ మంత్రులు పెనుకొండ నియోజకవర్గం కోసం పాకులాడుతున్నారు. నువ్వా..నేనా అంటూ ఈ నేతలు పట్టుకోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గం నా సొంతం అని ఒకరు అంటుంటే.. లేదు పార్టీనే నన్ను పంపిందంటూ మరొకరు చెలరేగిపోతున్నారు. ఇద్దరూ నేతలు వేరువేరుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరిద్దరి తీరుపై సొంత పార్టీ కింది స్థాయి నాయకులు, కార్యకర్తల నుంచే వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇద్దరు నేతలు స్థానికులు కాకపోయినా ఇంతలా పోటీ పడుతుడడం రాజకీయ వర్గాలను సైతం విస్మయానికి గురి చేస్తోంది.

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం కోసం వైసిపి మాజీ మంత్రులు మాలగుండ్ల శంకర నారాయణ, ఉషశ్రీ చరణ్‌ల మధ్య కొన్నాళ్లుగా పెద్ద ఎత్తునే పోరు నడుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత మాజీలు ఒక్కొక్కరూ వైసిపిని వీడుతున్నారు. పెనుకొండలో మాత్రం శంకరనారాయణ, ఉషశ్రీ చరణ్‌ల కథ మరోలా ఉంది. ఈ ఇద్దరు వైసిపి నాయకులు పెనుకొండ తనదంటే తనదని పోటీ పడుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మంత్రులైన వీరిద్దరూ పెనుకొండ నియోజకవర్గం కోసం పంతం పట్టుకు కూర్చొవడం గమనార్హం.

ఇద్దరూ స్థానికేతరులే..!

మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ సొంతూరు ధర్మవరం. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో కొనసాగు తున్నారు. సుధీర్ఘకాలం పాటు వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పని చేశారు. ధర్మవరంలో కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఉండటంతో శంకరనారాయణ మరో నియోజక వర్గం ఎంచుకోవాల్సి వచ్చింది. అందులో భాగంగానే పెనుకొండకు వచ్చారు. కురుబ సామాజికవర్గం శంకరనారాయణకు బాగా కలసి వచ్చింది. శంకరనారాయణ 2014లో ఓడిపోయినా 2019లో పెనుకొండలో గెలిచి టిడిపి కంచుకోటను బద్దలు కొట్టారు. కుల సమీకరణలో అదృష్టం కలసి వచ్చి జగన్ క్యాబినెట్‌లో మంత్రి కూడా అయ్యారు. మూడేళ్ల పాటు మంత్రిగా కొనసాగారు. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణలో పదవి కోల్పోయారు. శంకర నారాయణ స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన ఉషశ్రీ చరణ్‌కు మంత్రి పదవి లభించింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా ఉన్న ఈమెకు రాజకీయ సమీకరణలో భాగంగా వైసిపి అధిష్టానం 2024లో పెనుకొండ టికెట్టు ఇచ్చి అక్కడి నుంచి పోటీ చేయించింది. ఈ ఎన్నికల్లో ఆమె ఓటమి చవి చూసింది. ఇక పెనుకొండ నుంచి స్థానం మారి అనంత పార్లమెంట్‌కు పోటీ చేసిన శంకర నారాయణ కూడా ఓటమి చెందారు.

రెండు గ్రూపులుగా సమావేశాలు

ఇద్దరు మాజీ మంత్రులు ఓటమి తర్వాత పెనుకొండలో రాజకీయం చేయడానికి సిద్ధమయ్యారు. శంకరనారాయణ సొంత గృహం ఉండటంతో పెనుకొండలోనే మకాం వేశారు. ఆయన అనుచరులు ఎప్పటికప్పుడు కలుస్తూ రాజకీయ అంశాలు చర్చలు జరుపుతున్నారు. అధిష్టానం పిలుపునిచ్చే కార్యక్రమాలను తన వర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో చేస్తున్నారు. ఉషశ్రీచరణ్ ఎన్నికల ముందు పెనుకొండలో అద్దెఇంట్లో నివాసం ఉన్నారు. ఎన్నికల అనంతరం ఇంటిని ఖాళీ చేశారు. పార్టీ కార్యాలయం కూడా ఖాళీ చేసి మరో చోట అద్దెకు తీసుకున్నారు. తిరుమల లడ్డూ వివాదంపై దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని అధిష్టానం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమాన్ని శంకరనారాయణ, ఉషశ్రీ గ్రూపులు వేరువేరుగా నిర్వహించారు. ఇలా ప్రతి కార్యక్రమాన్ని వేరువేరుగానే చేస్తున్నారు.

ఇద్దరిపైన సొంతపార్టీలో వ్యతిరేకత

2024 ఎన్నికల్లో ఇద్దరు నేతలూ ఓటమి పాలయ్యారు. అనంతరం ఈ ఇద్దరూ పెనుకొండ కోసమే పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో ఈ ఇద్దరు నేతలతో పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇద్దరు నేతలనూ వ్యతిరేకించేవారు, సమర్థించేవారు పార్టీలో ఉన్నారు. ఇద్దరు నేతల మధ్య పార్టీ క్యాడర్ సైతం తీవ్ర గందరగోళంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి అధిష్టానం పెనుకొండ నియోజకవర్గంకు ఎవరు బాధ్యులో ప్రకటించాలనే వాదన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి విన్పిస్తోంది.

శంకరన్నపై వ్యతిరేకత

శంకరనారాయణ మంత్రిగా ఉన్న సమయంలో సొంతపార్టీ నాయకులను లెక్క చేయకపోవడం, స్వలాభం చూసుకోవడం లాంటి విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఆయనతోపాటు సోదరుల వ్యవహారశైలిపై కూడా సొంతపార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఐదేళ్ల తర్వాత ఇదిమరింత ఎక్కువ కావడంతో 2024లో పెనుకొండ నియోజకవర్గం నుంచి శంకర నారాయణను అనంతపురం పార్లమెంట్‌కు మార్చారు. అయిష్టంగా పార్లమెంట్‌కు పోటీ చేసిన ఆయన ఓటమి తర్వాత తిరిగి సొంత నియోజకవర్గం పెనుకొండకు వచ్చారు.

ఉషశ్రీ చరణ్‌ది అదే తీరు...

ఉషశ్రీచరణ్ మంత్రి అయ్యాక తన రూటే సపరేటు అన్నరీతిలో వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతో కళ్యాణదుర్గంలో ఆమెపై వ్యతిరేకత మరింత పెరిగింది. సొంతపార్టీ నాయకులు, కార్యకర్తలను వేధించినట్లు ఆరోపణలున్నాయి. ఆర్థికంగా, ఆస్తులపరంగా, పదవులు ఇలా అన్ని విషయాల్లో సొంతపార్టీ నాయకులను లక్ష్యం చేసినట్లు ఆమెపై విమర్శలున్నాయి. ఆమె వ్యతిరేకంగా రెండేళ్ల లోపే సొంత పార్టీ నాయకులు ఆందోళనలు చేశారు. అధిష్టానానికి ఫిర్యాదులు మీద ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే జగన్ ఆమెను పెనుకొండకు పంపారు. పెనుకొండలో గెలుపుకోసం ఆమె ఎంత శ్రమించినా ఓడిపోక తప్పలేదు.

ఎన్నికల ముందు కలిసి మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, శంకర నారాయణ(ఫైల్‌ఫొటో)

పెనుకొండకు ఉషశ్రీ వద్ద అంటూ ఎన్నికల ముందు ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు (ఫైల్‌ఫొటో)

నేడు ఎఫ్ ఎకాలజీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో వాతావరణ అనుకూల సుస్థిర గ్రామాభివృద్ధి అవగాహన సదస్సులు బుధవారం నాడు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులకు పలువురు శాస్త్రవేత్తలు రానున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవనన్నట్టు ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణ అనుకూల గ్రామాభివృద్ధి ప్రణాళిక గురించి ఐఐఎస్‌సి శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్‌హెచ్ రవీంద్రనాథ్, వాతావరణ మార్పులపై ఐఐఎస్‌సి శాస్త్రవేత్త సుస్మ పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం నుంచి డాక్టర్ విజయశంకర్ బాబు డ్రైల్యాండ్ అగ్రికల్చర్‌లో చేపట్టాల్సిన చర్యలపై వివరించనున్నారు. డ్రౌట్ మిటిగేషన్ ప్రాక్టీసెస్‌పై డాక్టర్ యలమందారెడ్డి వివరించనున్నారు. రెండో రోజు సదస్సుల్లోనూ వాతావరణ మార్పుల నేపథ్యంలో గ్రామంలో సుస్థిర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు

◆ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి సమావేశాల్లో తీర్మానం ◆ ముగిసిన సమావేశాలు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కందారపు మురళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరాటాలు చేయనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకటించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు మంగళవారం ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు హాజరై దేశం, రాష్ట్రంలో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానం అమలుతో తలెత్తిన సమస్యలపై ప్రధానంగా చర్చించారు. మంగళవారం జరిగిన 4వ రోజు శిక్షణ తరగతులకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కందారపు మురళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు కృషి చేయాల్సి ఉండగా, ప్రయివేటు విద్యా రంగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఉన్నాయని విమర్శించారు. జాతీయ విద్యా విధానం అమలుతో ఇప్పటికే రాష్ట్రంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి విద్యా రంగంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాలుగు రోజుల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలను విజయవంతం చేసినందుకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసన్న, అశోక్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్ధూ, ఓతరు పరమేష్ ధన్యవాదాలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై పలు తీర్మానాలు

నాలుగు రోజుల సమావేశాల్లో ఎస్ఎఫ్ఐగా చేపట్టాల్సిన కర్తవ్యాలపై తీర్మానాలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలులో జాప్యం, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ పోరాటాలకు శ్రీకారం చుడుతూ నిర్ణయం తీసుకున్నారు. డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వసతి దీవెన, విద్యా దీవెన, స్కాలర్‌షిప్‌ల అంశంపై ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రకటించారు. విద్యారంగ సమస్యలపై అక్టోబర్ 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యలపై ప్రభుత్వానికి వినతి పత్రాలు అందజేయడం కోసం భవిష్యత్‌లో సంక్షేమ హాస్టల్‌ల సర్వేలు నిర్వహించేలా తీర్మానం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం యూనివర్శిటీల్లో కళాశాలల్లో సదస్సులు నిరసన కార్యక్రమాలు నిర్వహించేలా పిలుపునిచ్చారు.

పాఠశాలలు, కళాశాలలకు చేయూతనిద్దాం

మౌలిక వసతులు కల్పించేలా చర్యలు - కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ వారు చదివిన పాఠశాలలు, కళాశాలలకు చేయూతనివ్వాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ, సంబంధిత శాఖలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో చదివి మంచి స్థాయిలో ఉన్న పూర్వం విద్యార్థులతో ఒక వాట్సాప్ గ్రూపును తయారు చేసి వారు చదివిన పాఠశాలలో అవసరమైన సదుపాయాలకు సంబంధించి జాబితాను తయారుచేసి ఉంచాలన్నారు. వారు చదివిన పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు తీసుకోవాలన్నారు. తద్వారా ఆ స్కూలు, కళాశాల అభివద్ధికి తోడ్పడే విధంగా చూడాలన్నారు. డబ్బు సహాయం కాకుండా వస్తువు రూపంగా వారి నుంచి సేకరించే విధంగా చూడాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ రెసిడెన్షియల్ స్కూల్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ ఇలా ప్రతి ఎడ్యుకేషన్ సెక్టార్‌లో జరిగే విధంగా నెలవారి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏవో కృష్ణయ్య, సర్వ శిక్ష అభియాన్ ఏడీ నాగరాజు, ఏఎంవో చంద్రశేఖర్, డివిఇఒ వెంకటరమణ నాయక్, డిటిడబ్ల్యుఒ రామాంజనేయులు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, సాంఘిక సంక్షేమ గురుకుల డిసిఒ ఉదయశ్రీ, కేజీబీవీ, ఐటిఐ, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కో-ఆపరేటివ్ సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలి

జిల్లాలోని అన్ని కోపరేటివ్ సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కోపరేటివ్ అభివద్ధి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 కోపరేటివ్ సొసైటీలు ఉండగా, అందులో 11 సొసైటీలలో ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. మిగిలిన 23 సొసైటీల్లో వచ్చే 30 రోజుల్లోగా ఎరువుల వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోపరేటివ్ సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతుల డేటాకు సంబంధించి కంప్యూటరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఆయా సొసైటీల్లో సిబ్బంది ఖాళీల భర్తీ చేసేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఒ అరుణకుమారి, డీపీవో ప్రభాకర్ రావు, డిసిసిబి సీఈవో సురేఖారాణి, ఫిషరీస్ డిడి శ్రీనివాస నాయక్, డిపిడిఎం తేజస్విని, వ్యవసాయ శాఖ ఏడీ రాకేష్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-ఉరవకొండ

తహసీల్దార్ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు తహశీల్దార్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రికార్డ్ రూమ్ లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అన్ని కార్యాలయాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలన్నారు. భూమి సమస్యలు, రెవెన్యూ సేవల మీద ప్రత్యేక దృష్టి ఉంచి వాటిని నిర్ణయించిన సమయంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ తహశీల్దార్ మహబూబ్ బాషా, ఆయా మండలాల తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'సామ్‌సంగ్'కు కార్మిక చట్టాలు పట్టవా..?

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సామ్‌సంగ్ బహుళ జాతి సంస్థ యాజమాన్యం భారతదేశ కార్మిక చట్టాలను గౌరవించదా అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ప్రశ్నించారు. సిఐటియు జాతీయ కమిటీ పిలుపుమేరకు తమిళనాడు పెరంబదూర్ సామ్‌సంగ్ ప్లాంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం సప్తగిరి సర్కిల్ లలితకళా పరిషత్ సామ్‌సంగ్ షోరూమ్ వద్ద ధర్నా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తమిళనాడు పెరంబదూర్ ప్రాంతంలోని సామ్‌సంగ్ పరిశ్రమలో గత కొన్ని నెలలు నుంచి 2 వేల మంది కార్మికులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ ఆందోళన కొనసాగిస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు సెప్టెంబర్ 9 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ సామ్‌సంగ్ భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు, భారత రాజ్యాంగాన్ని, కార్మిక చట్టాలను గౌరవించాలన్నారు. రాజ్యాంగం ప్రకారం కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును గుర్తించాలన్నారు. పని వేళలు మార్చాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పిఎఫ్,ఈఎస్ఐ చట్టాలను అమలు, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేదాకా జరిగే ఈ సమ్మెకు దేశవ్యాప్తంగా కార్మికులందరూ మద్దతు తెలియజేస్తారన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ పెద్దలు విదేశీ బహుళజాతి కంపెనీ సామ్‌సంగ్ భారత కార్మికులపై వ్యవహరిస్తున్న అనాగరిక చర్యలను ఖండించాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకునేలా, కార్మిక చట్టాల అమలు కోసం సామ్‌సంగ్ యాజమాన్యాన్ని ఆదేశించాలని సెలవిచ్చారు. ఈ ధర్నాలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనారాయణ, బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్, నాగరాజు, ఆజాం బాషా, భాస్కర్, జిలాన్ బాష, శ్రీనివాస్ మూర్తి, కుమార్, హరి, పెద్ద కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సామ్‌సంగ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

పుట్లూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి భూమిరెడ్డిగారి రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య, తాగునీరు, తదితర సమస్యలు లేకుండా చూడాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో చేపట్టిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో అలివేలమ్మ, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్, ఏవో కాత్యాయని, హౌసింగ్ ఎఇ సంధ్యారాణి, ఎంపిటిసిలు భూమిరెడ్డి గారి నాగార్జునరెడ్డి, ఆదినారాయణ, సర్పంచులు మహేశ్వర్‌రెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం : మండలం బోరంపల్లి గ్రామంలో అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న మహేంద్రకు ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. బోరంపల్లికి చెందిన మహేంద్ర కొంతకాలంగా లివర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య కోసం ప్రతినెలా రూ.12వేలు ఖర్చు అవుతోంది. విషయం తెలుసుకున్న బద్దేనాయక్ ప్రతినెలా సరిపడే మందులను అందజేస్తామని హామీ ఇచ్చారు..

ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

In The Court of The Prl. District Judge, Ananthapuramu
E.P.No:350/2024 in A.A.No:02/2022
Between:
M/s Shriram Finance Ltd. Branch-2 Ananthapuramu, Rep by its Authorized Signatory B.Chandra Sekhar ...D.Hr
And
Mohammad Ziaul Haq and others ...J.Drs
Notice to J.Dr No:3
J.Dr:3:L.Sreeramulu S/o L.Peddanna, D.No:28-2-577 Navodaya Colony, Ananthapuramu. Occ:AR Head Constble, ARHC No:2381, ATP-Platoon-14, Ananthapuramu.
పై నెంబరు కేసులో 3వ J.Dr అయిన మీ హాజరు నిమిత్తం 16/10/2024 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
J.L.Narasimhulu,
Advocate, Ananthapuram.

In The Court of The Addl. Senior Civil Judge, Ananthapuramu
E.P.No:153/2014 in O.S.No:20/2011
Between:
Pendlimarri Rangappa S/o P.Papaiah, R/at D.No:18-843, Neeruganti Street, Old Town, Ananthapuramu ...Petitioner/D.Hr
And
G.Rama Mohan S/o S.Sanjeevappa, R/at D.No:18-847, Neeruganti Street, Old Town, Ananthapuramu ...Respondant/J.Dr
వేలం ప్రకటన
అర్జీదారుడు తన ఇ.పి.మొత్తమును రాబట్టుటకు J.Dr కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు 18/10/2024వ తేది ఉదయం 10:30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.
షెడ్యూలు
Property Situated within R.D. & S.R.D. of Anantapur and within the limits of Anantapurarnu Municipal Corporation:

Ward No.	T.S.No.	Door No.	Asst. No.
Old-12	1930/10	Not known	Not knovm
New-12		Not known	Not known
Present-18		408-A	1184119419

Present D.No.18/847, Neeruganti Street, Old Town. Anantapur.**Bounded by:** **East :** House of N.Gurappa **South:** House of N.Venkata Chalapathi **North :** House and Vacant site of J.Venkatesulu **West :** Road **Measuring:**
North-South=Eastern side 25"4" or 7.72 Meters
North-South=Western side 25.4" or 7.72 Meters
East-West = Northern side : 35" or 10.67 Meters
East-West=Southern side 34" or 10.36 Meters
Market value of_to_properly is R5.5,00.000,
అమీన విలువ రూ.14,00,000/-
D.Hr విలువ రూ.5,00,000/-
మార్కెట్ వాల్యు రూ.5,00,000/-
బోయపాటి రాజశేఖర్,
D.Hr వకీలు, అనంతపురం, సెల్:9440289779.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
సక్ససన్ ఓ.పి. నెం:15/2024
Between:
1. షేక్ రిజ్వానా
2. షేక్ సోఫియా
3. షేక్ బాను
4. షేక్‌హాజీవలి ...పిటీషనర్స్
V/S
Nil ...రెస్పాండెంట్
ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై తెలిపిన అర్జీదారులు తమ తల్లిదండ్రులు అయిన లేట్ షేక్ షాషావలి మరియు షేక్ ఫకీలా, శ్రీనివాసపురం, తాడిపత్రి టౌన్ అను వారులకు తాడిపత్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్.ఎఫ్.రోడ్డు బ్రాంచ్ నుండి "ప్రధానమంత్రి సురక్షా భీమా యోజన" పథకం ద్వారా చెందవలసిన రూ.4,00,000-00లు మొత్తమును తీసుకొనుటకు మాకు మాత్రమే వారసులుగా అధికారము కలదని మరియు చనిపోయిన పై తెలిపిన వారి తల్లిదండ్రులకు అర్జీదారులు తప్ప మిగతా వారుసులు ఎవ్వరు లేరని తెలియజేస్తూ, పై మొత్తమును తీసుకొనుటకు వారసత్వ సర్టిఫికెట్ ఇవ్వమని అర్జీ దాఖలు చేసుకొని ఉన్నారు.సదరు అర్జీ 24/10/2024 నాటికి కోర్టువారు వాయిదా వేసి ఉన్నారు. కావున ఎవరికైనా పై అర్జీ పైన ఆక్షేపణలు ఉన్న లేక హక్కు ఉన్న పై తేది నాడు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును.లేకున్న పై అర్జీ వాదుల తరుపున తీర్మాణించబడును అని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తరువు మేరకు)
ఇట్లు,
పి.వి.ప్రతాపరెడ్డి, బి.ఎ.,బి.ఎల్.
అడ్వకేట్ (వాదుల తరపున) తాడిపత్రి,
అనంతపురం జిల్లా.
సెల్ నెం.9848533771.

'నాడు-నేడు' అంటే ఇదేనా..!

వైసిపి నాయకులపై ఎమ్మెల్యే దగ్గుపాటి ఫైర్.. హౌసింగ్ బోర్డులో 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే'

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నాడు నేడు అంటూ ఊదరగొట్టిన.. గత ప్రభుత్వ పాలన ఎలా ఉందో చెప్పడానికి అనంతపురం నగరంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలే నిదర్శనమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రెండోరోజు మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే కార్యక్రమం కొనసాగింది. ఇందులో భాగంగా 26వ డివిజన్‌లో నాయకులు పెద్దఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరాతీశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలు విషయంలో కొన్ని ఫిర్యాదులు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. పింఛన్‌లు మాకు రావడం లేదని, తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు విన్నవించారు. వెంటనే వాటిని పరిష్కరించాలని స్థానికంగా ఉన్న అధికారులకు ఆదేశాలిచ్చారు. మరోవైపు హమాలీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో చూసి ఎమ్మెల్యే తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు కోట్ల రూపాయలు ఖర్చులు చేశారని.. అయితే ఇలాంటి శిథిలావస్థలో ఉన్న భవనాలపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. వెంటనే ఈ సమస్యను మంత్రి నారా లోకేష్ దష్టికి తీసుకెళ్లి కొత్త భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చామని.. అలాగే కొన్ని సమస్యలు కూడా మా దష్టికి వచ్చాయని.. వాటి పరిష్కారం కోసమే తాను కాలనీల్లో పర్యటిస్తున్నానన్నారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం వలన వారిలో ఒక ధైర్యం నింపినట్టు ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ దృష్టికి తీసుకొవచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోగానే పరిష్కరిస్తానని దగ్గుపాటి హామీ ఇచ్చారు. ముఖ్యంగా మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను తమ వారు నోట్ చేసుకుంటున్నారని, వాటి పరిష్కారం విషయంలో కూడా పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి సరిపూటి రమణ, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం నాగభూషణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, తెలుగు యువత నగర అధ్యక్షుడు బొమ్మినేని శివ, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే వెంకటేష్, టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి యాదవ్, గంగారామ్, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి వార్తకు స్పందన
అసాంఘిక కార్యకలాపాలపై దాడులు

ప్రజాశక్తి-కుందుర్పి

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ జగదీష్ కుందుర్పి పోలీసు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కుందుర్పిలో 'ఏరులై పారుతున్న మద్యం' అన్న శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనానికి స్పందించిన ఎస్పీ మండల పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నీలకంఠేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం మద్యం దుకాణాలు, మట్కా నిర్వాహకులపై దాడులు చేశారు. ఇందులో భాగంగా వ్యక్తిని అరెస్టు చేయడంతోపాటు ఓ కేసు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జబీవుల్లా, కానిస్టేబుల్ హరినాథ్‌రెడ్డి, తోపిక్, హోంగార్డ్ తిమ్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

'రాచపాళెం'కు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డిని చం.స్పందన ఆత్మీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారం వరించింది. స్వర్ణభారతి సాక్షిగా, పాలి, రెండు ప్రపంచాలు వంటి కవితా సంపుటాలను వెలువరించడంతోపాటూ అనేక కవిత్వ విశ్లేషణ వ్యాసాలు రాసిన సుదీర్ఘ కృషికి గుర్తింపుగా స్పందన కన్వీనర్లు రాచపాళెంను 2023 చం.స్పందన ఆత్మీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారానికి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. త్వరలో అనంతపురంలో జరుగనున్న కార్యక్రమంలో రాచపాళెంకు నగదు బహుమతితోపాటుగా, జ్ఞాపిక, శాలువతో ఘనసత్కారం చేయనున్నట్లు 'స్పందన' అనంత కవుల వేదిక అధ్యక్షులు తూముచర్ల రాజారామ్, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాచపాళెంకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం లభించినందుకు స్పందన సభ్యులు షమీవుల్లా, అంకే శ్రీనివాస్, నందవరం కేశవరెడ్డి, రాధేయ, షేక్ నబిరసూల్, బండి నారాయణస్వామి, రాయుడు, మధురశ్రీ తదితర సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

పుట్లూరు : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ అలివేలమ్మ సూచించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సచివాలయంలో ఉంటూనే ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి జిలాన్‌బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఎఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

2023 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన బీమా ప్రకటించడంతోపాటు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు అన్నదాత ఖాతాల్లో వేసి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆనందరావుపేట సుంకులమ్మ ఆలయం వద్ద సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించొద్దన్నారు. గ్రామాల్లో కూలీలు వలసల పోకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఒత్తిడితో వ్యవసాయం మోటార్లకు మీటర్లు పెట్టేందుకు తీసుకొచ్చిన జీవో 22ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, భూ యజమాని సంతకంతో పని లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వందశాతం సబ్సిడీతో డ్రిప్పులు, స్ప్రింక్లర్లు అందజేయాలని, మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. మండలవ్యాప్తంగా రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని, రాచేపల్లి లెడ్‌క్యాప్ తోళ్ల పరిశ్రమ ఓపెన్ చేయాలని, మండల కేంద్రం సమీపవంలోని మరువకొమ్మ వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సుంకన్న, ఆంజనేయులు, వెంకటస్వామి, రామాంజనేయులు, కొండారెడ్డి, కుళ్లాయిస్వామి, జయరాముడు, ఆంజనేయులు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, ధనాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్


ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

గుంతకల్లు : గుంతకల్లులోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం నాయకులు కర్నూలు జిల్లాలోని ఆలూరులో ఉన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నివాసానికి వెళ్లి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ సిఐటియు కాలనీలో 21ఏళ్లుగా నివాసం ఉంటున్నా ఇంటి పట్టాలు ఇవ్వలేదన్నారు. అలాగే కసాపురం రోడ్డులోని సర్వే నెంబర్ 398లో నల్లగుట్టను చదును వేయించి పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, దోనిముక్కల సర్వే నెంబర్ 43లో పట్టాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సిపిఎపం పటణ కమిటీ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఎస్‌కెఎం.బాషా, అబ్దుల్లా, సురేంద్ర, రామునాయక్, షబ్బీర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒఆర్‌డి దేవదాస్

బొమ్మనహాల్ : మండలవ్యాప్తంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఇఒఆర్‌డి దేవదాస్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే ఇంకా ఎక్కడైనా అవసరం ఉంటే వాటిని గుర్తించి అంచనాలు తయారు చేయాలని సూచించారు. అలాగే వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా ఇప్పటి నుంచే గుర్తించి నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు

కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

బుక్కరాయసముద్రం : మండలంలోని కొర్రపాడు అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇందుకు అనేకంగా వెలుగు చూశాయన్నారు. ఇటీవల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ చేసి ఆకస్మిక తనిఖీల్లో కూడా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి నిర్లక్ష్యం బయటపడి ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే అన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ఉపాధి' పనుల గుర్తింపుపై గ్రామసభ

నార్పల : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో మంగళవారం 2025-26 ఉపాధి హామీ పనుల నిర్వహణపై గ్రామసభను నిర్వహించారు. ఇందులో భాగంగా ఏఏ పనులు చేయాలనే విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడితే సమస్యలు పరిష్కారం

గుత్తి : ఐక్యంగా పోరాటాలు చేస్తేనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కస్తుందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గుత్తి రైల్వే డీజిల్ లోకో షెడ్, బాక్సెన్ డిపో, రైల్వేస్టేషన్‌లో కార్మికులతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా సమస్యలను కార్మికులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎడిఎస్ నారాయణ, మాజీ ఎడిఎస్ మస్తాన్‌వలి, కార్యదర్శి రామంజులరెడ్డి, హెచ్ క్యూఆర్ఎస్ బ్రాంచి నాయకుడు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి తహశీల్దార్ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు

కలెక్టర్‌తో ఐఎస్ఓ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న తహశీల్దార్ దాసరి ఓబులేసు

గుత్తి : గుత్తి తహశీల్దార్ కార్యాలయానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ గుర్తింపు దక్కింది. ఐఎస్ఓ గుర్తింపుకు 39 రకాల ప్రమాణాలు ఉండాలి. అయితే స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి 42 ప్రమాణాలు కలిగి ఉన్నాయి. ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న గుత్తి తహశీల్దార్ కార్యాలయాన్ని ఎంపిక చేసేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుత్తి తహశీల్దార్ కార్యాలయం ఎంపిక కావడంతో జిల్లాకేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్‌తో తహశీల్దార్ దాసరి ఓబులేసు ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టాలి

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో కొనసాగుతున్న ఇసుక దోపిడీని అరికట్టాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు.. ఉన్న సంపదను టిడిపి నేతలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఇసుక దోపిడీ జరుగుతున్నా, మద్యం పాలసీలో ప్రభుత్వానికి ఆదాయం గండిపడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇసుకను ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నా నియంత్రించలేని పరిస్థితి ఉన్నారన్నారు. నిత్యం ప్రజాప్రతినిధుల కన్నుసన్నల్లోనే ఇసుక తరలిపోతోందన్నారు. చంద్రబాబు గానీ, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న లోకేష్‌కు గానీ ఇసుక దోపిడీ కనిపించకపోవడం బాధాకరమన్నారు. గతంలో రూ.15 వేలకు దొరికే ఇసుక నేడు రూ.22 వేలకు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఇక మద్యం పాలసీలో ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. మద్యం దుకాణాలకు టెండర్లు వేయకూడదని ప్రతి ఎమ్మెల్యే బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఏకంగా సీఐలు, డీఎస్పీలే ఫోన్లు చేసి మద్యం షాపులకు డీడీలు కట్టి వేసుకుంటే మంచిది కాదని, స్టేషన్లకు రావాలని పిలుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇతరులు వ్యాపారాలు, కాంట్రాక్టర్లు కూడా చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వైసిపి ప్రజల పక్షాన నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే ఎస్పీ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు స్పందించి మద్యం, ఇసుక విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు

ప్రజాశక్తి-బెలుగుప్ప

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు గంగవరం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మలేరియా వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇందులో భాగంగా ఇళ్లలోని తొట్టెలు, డ్రమ్ముల్లో ఉన్న నీటిని తొలగింపజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొట్టెలు, డ్రమ్ముల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. అప్పుడే ఇలాంటి రోగాలు బారిన పడకుండా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా ఉపాధికారి సత్యనారాయణ డాక్టర్ కార్తీక్ కుమార్ రెడ్డి డాక్టర్ ప్రియాంక ఎం పి హెచ్ ఈ ఓ విజయ్ కుమార్ సూపర్వైజర్ వెంకటరమణ వసంత ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలి

వైద్యాధికారిణి సాయినాగశ్రీ

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రజారోగ్య సమస్య పరిరక్షణ కోసం గర్భిణులు అందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని వైద్యాధికారిణి సాయినాగశ్రీ సూచించారు. ఆశా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని తిమ్మంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మండలవ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతేగాకుండా కూరగాయలు, ఆకుకూరలను ఒకటికి, రెండుసార్లు నీటితో శుభ్రం చేసుకుని వాడుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల్లో ఏడుగురు ఎంఎల్‌హెచ్‌పి, ఏడుగురు ఎఎన్ఎంలు, 20 మంది ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. అలాగే గర్భిణులకు గర్భస్త, రక్తపరీక్షలు నిర్వహించి మంచి మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. వైద్యుల సలహాలు, సూచనలతోపాటు గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. ఇకపోతే పాముకాటుకు, కుక్కకాటుకు టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, సిహెచ్ఒ లక్ష్మీనారాయణమ్మ, పిహెచ్ ఎం మీనాకుమారి, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రాము, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతిని అరికట్టాలి

బుక్కరాయసముద్రం : జాతీయ ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అవినీతిని అరికట్టాలని టిడిపి సీనియర్ నాయకులు నారాయణస్వామి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కార్యాలయంలో ఎంపిడిఒ సొలమన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ చెదుల్ల గ్రామంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించకపోయినా బిల్లులు పెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుని అర్హులైన కూలీలకు పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గుర్రప్ప, కూలీలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

నార్పల : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ అంగన్వాడీ సెంటర్‌లో సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించకపోతే అనేక రోగాలు దరిచేరే అవకాశం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, రాజామణి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ లావణ్య, అంగన్వాడీ కార్యకర్త కుళ్లాయమ్మ, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న ప్రతిరైతునూ ఆదుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు ఉద్దేహాల్, కురువల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించామని, పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పంటలు సాగు చేసిన రైతులు పంట విస్తీర్ణం, ఆధార్‌కార్డు, బ్యాంకు, పట్టాదారు పాసు పుస్తకాలతో ఆయా వ్యవసాయ అధికారులు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎడి లక్ష్మానాయక్, బొమ్మనహాల్ ఎఒ సాయికుమార్, ఎఇఒలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు : సిఐ

యల్లనూరు : మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ సత్యబాబు హెచ్చరించారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ సత్యబాబు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన మట్కా, పేకాట స్థావరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. అలాగే ఆలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల పరిసరాల ప్రాంగణాల్లో మద్యం, గుట్కా అసాంఘిక కార్యకలాపాలు చేయరాదన్నారు. అలాంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామప్రసాద్, ఎఎస్ఐ సంపత్‌కుమార్, జమేదారు శివన్నారాయణ, పోలీసులు రవీంద్రనాథ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుమారుని మృతిని జీర్ణించుకోలేక...

గుత్తి : పట్టణంలోని గుత్తి కోట రైల్వే స్టేషన్ క్యాబిన్ వద్ద మంగళవారం రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన రమేష్‌బాబు (52) కుమారుడు ఏడాది క్రితం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి మానసిక వేదనకు గురవుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో తీవ్ర మానసిక వేదనకు లోనై మంగళవారం వచ్చి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మట్కాబీటర్లు అరెస్టు

గుత్తి : మట్కా స్థావరాలపై గుత్తి పోలీసులు ముమ్మర దాడులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా సిఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని క్రీడామైదానం వద్ద దాడులు నిర్వహించి ఐదుగురు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. పట్టణానికి చెందిన ఎన్.పురుషోత్తం, ఎన్.శివ,టి.రఘు, కె.దానమయ్య, పెద్దవడుగురు మండలం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన బి.వెంకటరాముడును అరెస్టు చేసి రూ.43, 250 నగదు, 24 మట్కా చీటీలు, 5 పెన్నులను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

మట్కాబీటర్ల వివరాలను వెల్లడిస్తున్న సిఐ వెంకటేశ్వర్లు

విజయనగరం మున్సిపల్ కమిషనర్ వ్యాఖ్యలు సరికావు

అనంతపురం కలెక్టరేట్ : వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను హిజ్రాలతో పోలుస్తూ విజయనగరం మున్సిపల్ కమిషనర్ చేసిన వ్యాఖ్యలు సరికావని ఎపి వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శుల సంఘం నాయకులు మంగళవారం సంఘం సమావేశంలో ఖండించారు. ఈనెల 5నరెవెన్యూ సమీక్ష సమావేశంలో విజయనగరం జిల్లా మున్సిపల్ కమిషనర్ వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీలను 'హిజ్రాల'తో పోల్చి అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ముఖ్యంగా వృత్తిపరమైన నేపథ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ మన గౌరవం దెబ్బతింటుందన్నారు. ఈ బాధాకరమైన వాతావరణం కారణంగా ఒక ఉద్యోగి అపస్మారక స్థితిలోకి వెళ్లడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

నేడు వార్డు సభ్యులకు శిక్షణ

గుత్తి : మండల పరిధిలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉప సర్పంచులతోపాటు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇరువురు వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే శిక్షణకు తప్పక అందరూ హాజరుకావాలని కోరారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం, గురువారాల్లో మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ గంగావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం చేయాల్సిన పనులను వివరించారు.

పుట్లూరు : మండలంలోని ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు నేటి నుంచి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొనాలని కోరారు.

గార్లదిన్నె : మండలంలోని ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు నేటి నుంచి రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో పారిశుధ్యం, ఘన, వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీ, స్ట్రీట్ లైట్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఎంపిడిఒ, ఇఒఆర్‌డికి సన్మానం

బెలుగుప్ప : ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి నాగేశ్వరరావుశాస్త్రిని బెలుగుప్ప, నక్కలపల్లి, ఎలగలవంక సర్పంచులు సాలిబాయి, రామిరెడ్డి, బాబూనాయక్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శివరంజని, గంగ్యానాయక్, ఆనంద్‌నాయక్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ధర్నాకు తరలిన బీఎస్పీ నాయకులు

రాయదుర్గం : విజయవాడలో నిర్వహించనున్న బిసి కులగణన మహాధర్నాకు రాయదుర్గం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు మంగళవారం రైలులో తరలివెళ్లారు. విజయవాడకు వెళ్లిన వారిలో బీఎస్పీ నాయకులు మండి జానకిరాముడు, రామాంజినేయులు, ఉలుగప్ప, హరికృష్ణ, నాగరాజు, గొల్ల నాగరాజు, గంగారామ్, రాజప్ప, మంజులమ్మ, వన్నూరమ్మ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు వెళ్తున్న రాయదుర్గం బీఎస్పీ నాయకులు

మట్టి పరీక్ష ఫలితాల కార్డులను అందజేస్తున్న ఎడిఎ రవి

ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

అనంతపురం ఎడిఎ ఎం.రవి

ప్రజాశక్తి-అనంతపురం

రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకున్న తర్వాతనే పంటలు సాగు చేయాలని అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి సూచించారు. మంగళవారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని అక్కంపల్లి, రాచనపల్లి రైతు సేవాకేంద్రాల పరిధిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేరుశనగ, కంది పంటలను ఆశించే చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. తర్వాత మట్టి నమూనా పరీక్షల ఫలితాల కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి అధికారి మురళీకృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజినేయులు, ఉద్యానశాఖ సహాయకులు శివశంకర్, ఎపిఎంఐపి అధికారిణి హరిత, రైతు సేవాకేంద్రం సహాయకులు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని హెచ్.సోదనపల్లి, గంగనపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి చెన్నవీరస్వామి మొక్కజొన్న, వేరుశనగ పంటల్లో సస్యరక్షణతోపాటు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి, అనంతపురం రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజాకుమారి, తాడిపత్రి సహాయ వ్యవసాయ సంచాలకులు చంగల్‌రాయుడు, మండల వ్యవసాయ అధికారి సి.చెన్నవీరస్వామి, వ్యవసాయ విస్తరణ అధికారి రాము, మార్కెటింగ్ విభాగానికి సంబంధించిన సుశీల, గంగనపల్లి సర్పంచి కుళ్లాయిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరు, గోరిదిండ్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కందిలో శనగపచ్చ పురుగు నివారణ, సమగ్ర యాజమాన్య పద్ధతులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సుచరిత, హెచ్‌ఇఒ శ్రీనివాసులు, ఆర్‌ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం

నార్పలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉరవకొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ తెలిపారు. ఇందులో భాగంగా వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం వివిధ పంటలను పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రసాద్, అగ్రికల్చర్ అసిస్టెంట్ తిమ్మన్న, వెటర్నరీ అసిస్టెంట్ విజయ్‌కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతులు వ్యవసాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడిన సాధించవచ్చని శాస్త్రవేత్తలు నారాయణస్వామి నటరాజ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శాస్త్రవేత్తలు వేరుశనగ, కంది, పప్పుశనగ, మొక్కజొన్న పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శుభకర్, రైతులు, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపిడిఒను కలిసిన నాయకులు

ఎంపిడిఒకు బొకే అందజేస్తున్న వైసిపి నేతలు

నార్పల : ఇటీవల నూతన ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన గంగావతిని వైసిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిటిసిలు పద్మనాభరెడ్డి, రాజారెడ్డి, వైసిపి నాయకులు నర్సింహులు, ముచ్చుకుంటపల్లి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సురేంద్రబాబుకు సన్మానం

కుందుర్పి : లండన్‌లో ప్రఖ్యాతిగాంచిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మ్యూజియంలో మహాత్మా గాంధీ లీడర్‌షిప్ అవార్డును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మండల టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కుందుర్పి నాయకులు

కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లికార్జున, మాజీ వైస్‌ఎంపిపి రవి, మాజీ కోఆప్షన్ సభ్యులు తాహిర్‌బాషా, మాజీ సర్పంచులు రాఘవేంద్రబాబు, పెద్దనరసింహప్ప, ఎర్రగుంట ఆనంద్, జిల్లా తెలుగు యువత పి.రామమూర్తినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ సత్తి, నాయకులు రంగనాథ్, దిలీప్, వెంకటేశులు, మల్లికార్జున, తలారి వెంకటేశులు, శ్రీరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

అలాగే టిడిపి ఎస్సీ సెల్ మండల కన్వీనర్ సూగేపల్లి సురేంద్ర ఆధ్వర్యంలో బ్రహ్మసముద్రం నాయకులు ఎమ్మెల్యే సురేంద్రబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కేంచనపల్లి తిప్పేస్వామి, గరుడాపురం దొనతిమ్మప్ప, దురదకుంట నారాయణ, నారాయణపురం మల్లేష్, సూగేపల్లి సురేంద్ర, తనయులు అఖిరానందన్, స్టాలిన్, అంగన్వాడీ కార్యకర్త అనిత, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-రాయదుర్గం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే రోగాల నుంచి దూరంగా ఉండవచ్చని రాయదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఆజాద్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు.

ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మంగళవారం రాయదుర్గం పట్టణ పరిధిలోని రాజీవ్‌గాంధీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్వచ్ఛ రాయదుర్గం.. స్వాస్థ రాయదుర్గం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ వరకూ సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఆశా కార్యకర్త, ఆరోగ్య కార్యదర్శి అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీనరసమ్మ, ఆరోగ్య కార్యకర్తలు సరోజ, విజయలక్ష్మి, శోభ, ప్రమీల, లలిత, సునీత, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని పంపనూరు గ్రామంలో ఎంపిడిఒ లక్ష్మీనరసింహా మంగళవారం పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఏర్పాటు చేసి చెత్తకుండీల్లో వేసుకోవాలన్నారు. ఆ చెత్తను పంచాయతీ సిబ్బంది వచ్చినపుడు అందజేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం పంపనూరును ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు హేమంత, సర్పంచి ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శులు శిరీష, సింగంపల్లి సెక్రటరీ శిరీషా, విఆర్ఒ కెవి.ప్రసాద్, సర్వేయర్లు మనోజ్, ఫీల్డ్ అసిస్టెంట్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

టీ స్టాల్ మహిళతో మాట్లాడుతున్న ఎంపిడిఒ లక్ష్మీనరసింహా